# ప్రతి ఒక్కరికీ లైసెన్స్ అందించడమే లక్ష్యం




ఉచిత లైర్నింగ్ లైసెన్స్‌ల పంపిణీలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్

**నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి**

**ఈ ఒక్క డ్రైవింగ్ లైసెన్స్ అనేక అవసరాలకు గుర్తింపు కార్డు**

**ఎల్ ఎల్ ఆర్‌ల పంపిణీలో మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

రఘునాథపాలెం, జూలై 22: ఖమ్మం నియోజకవర్గంలో 18 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరికీ లైసెన్స్ అందించడమే తన లక్ష్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ పేర్కొన్నారు. అర్హులైన యువతీ యువకులు, వాహనదారులు ఉచిత లైసెన్స్ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. లైసెన్స్‌ల మేళాలో భాగంగా ఖమ్మంలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు ఉచిత లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ (ఎల్‌ఎల్‌ఆర్) కాపీలను ఆయన పంపిణీ చేసి మాట్లాడారు. ఖమ్మం నియోజకవర్గంలో వాహనాలను కలిగి 10 వేల మంది పైచిలుకు వాహనదారులు, డ్రైవింగ్ వచ్చిన వాళ్లు ఉన్నట్లు ప్రత్యేక సర్వే ద్వారా గుర్తించామన్నారు. అర్హులైన వాహనదారులకు, డ్రైవింగ్ వచ్చిన ప్రతి ఒక్కరికీ పువ్వాడ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా లైసెన్స్ ఇప్పించాలనే ఆలోచనతో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు చెప్పారు. వాహనాల సంఖ్య నానాటికీ అధికమవుతుండడంతో ప్రమాదాలు కూడా పెరుగుతున్నాయని అన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని వాహనదారులందరికీ ఉచితంగా డ్రైవింగ్ లైసెన్సులను అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. వాహనాలు ఉన్న వారందరూ ఈ మేళాను వినియోగించుకొని ఇబ్బందులను తొలగించుకోవాలని, క్షేమంగా తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇప్పటి వరకు ఈ లైసెన్స్ మేళా ద్వారా 2 వేల మందికి ఉచితంగా లెర్నర్స్ లైసెన్సులను అందించినట్లు మంత్రి వివరించారు. మరో 8 వేల మందికి ఇవ్వాల్సి ఉన్నట్లు చెప్పారు. అనంతరం లబ్ధిదారులకు మంజూరైన లెర్నర్స్ లైసెన్స్ రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. జిల్లా రవాణా శాఖ అధికారి తోట కిషన్‌రావు, ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు వల్లభనేని రామారావు, ఆర్జేసీ కృష్ణ, బచ్చు విజయ్‌కుమార్, పిన్ని కోటేశ్వరరావు, దండా జ్యోతిరెడ్డి, రావూరి సైదుబాబు, తన్నీరు శోభారాణి, మదూరి సైదారావు, కన్నం ప్రసన్నకృష్ణ, సంక్రాంతి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



## సీఎం కేసీఆర్‌ను కలిసిన ఉమ్మడి జిల్లా ప్రజాప్రతినిధులు

రఘునాథపాలెం, జులై 22 : ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు శనివారం రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్‌ను తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లి నియోజకవర్గ అభివృద్ధిపై సండ్రతో సీఎం చర్చించారు. కొత్తగూడెం పరిధిలోని ఎస్ఆర్‌టీ ఏరియా, మాయాబజార్, వనమా నగర్‌లో నిర్వాసితులకు, కొత్తగూడెం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల సమస్యపై ఎమ్మెల్యే వనమా సీఎంకు విన్నవించడంతో స్పందించి సీఎం కేసీఆర్ సమస్యను పరిష్కరించాలని సీఎంవోఏ అధికారులను ఆదేశించారు. సీఎం కేసీఆర్‌ను కలిసిన వారిలో బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేత నామా నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియా నాయక్ ఉన్నారు.

# తగ్గుతూ.. పెరుగుతూ..

- భద్రాచలం వద్ద దోబూచులాడుతున్న గోదావరి
- శనివారం రాత్రి 8 గంటలకు పెరిగి 41.01 అడుగుల వద్ద ప్రవాహం
- మరికొంత పెరిగితే మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేసే చాన్స్



భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి

భద్రాచలం, జూలై 22: భద్రాచలం వద్ద గోదావరి వరద తగ్గుతూ పెరుగుతూ దోబూచులాడుతోంది. ఏటా జూలై, ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో వచ్చే గోదావరి వరదలతో పరీవాహక ప్రాంత గ్రామాలు, భద్రాచలంలోని పలు కాలనీలు ముంపునకు గురవుతుంటాయి. భద్రాచలం వద్ద గురువారం మధ్యాహ్నం 3:20 గంటలకు గోదావరి వరద ప్రవాహం 43 అడుగులకు చేరుకోవడంతో భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేశారు. అదే రోజు రాత్రి 10 గంటలకు 44.60 అడుగులకు చేరుకున్న గోదావరి.. ఆ తరువాత నిలకడగానే ఉంది. శుక్రవారం మధ్యాహ్నం 2 గంటలకు 42.7 అడుగులకు చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరికను అధికారులు ఉపసంహరించారు. అదే రోజు రాత్రి 10 గంటలకు 40.6 అడుగులకు తగ్గింది. భద్రాచలం కొత్తకాలనీలోని ఇళ్లల్లోకి వరదనీరు చేరడంతో అధికారులు వారిని హుటాహుటిన నన్నపనేని మోహన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించారు. శనివారం ఉదయం 6 గంటలకు 39.5 అడుగులకు తగ్గుముఖం పట్టడంతో అధికారులు, పట్టణ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. 9 గంటలకు 39.4 ఉన్న గోదావరి తరువాత కొద్దికొద్దిగా పెరుగుతూ మధ్యాహ్నం 3 గంటలకు 3 అంగుళాలు పెరిగి 39.7 అడుగులకు చేరింది. రాత్రి 8 గంటలకు మరికొద్దిగా పెరిగి 41.01 అడుగుల వద్ద ప్రవహిస్తోంది. అయితే ఆదివారం ఉదయం కల్లా మళ్లీ మొదటి ప్రమాద హెచ్చరికను జారీ చేసే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ భద్రాచలంలోనే ఉండి వరద పరిస్థితిని సమీక్షిస్తున్నారు. వరదల సహాయక చర్యల ప్రత్యేకాధికారులుగా ఉన్న అనుదీప్ దురిశెట్టి, కృష్ణ ఆదిత్య, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, కలెక్టర్ ప్రియాంక కూడా భద్రాచలంలోనే ఉంటూ అధికారులకు సూచనలు చేస్తున్నారు.

## మంత్రి కేటీఆర్ పుట్టిన రోజును పండుగలా జరపాలి

### రక్తదాన శిబిరాలు నిర్వహించాలి : వైరా ఎమ్మెల్యే రాములునాయక్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాములునాయక్

వైరా టౌన్, జూలై 22: ఈ నెల 24న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలను నియోజకవర్గంలోని ప్రతి ఇంట్లోనూ పండుగలా జరపాలని వైరా ఎమ్మెల్యే రాములునాయక్ పేర్కొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, బైక్ ర్యాలీలు నిర్వహించాలని, ఇందులో పాల్గొనేందుకు ఐదు మండలాల నుంచి శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. వైరాలోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మంత్రి కేటీఆర్ జన్మదిన వేడుకల్లో బీఆర్ఎస్ శ్రేణులన్నీ క్రమశిక్షణతో పాల్గొనాలని సూచించారు. పార్టీ సత్తాతో ప్రతిపక్షాల నోళ్లు మూయించాలని పిలుపునిచ్చారు. ఇంటింటా పుట్టిన రోజు వేడుకలను నిర్వహించి ప్రతిఒక్కరూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, మంత్రి కేటీఆర్‌కు తోడ్పాటు అందించాలని కోరారు. వారిని మరోసారి చల్లగా దీవించి బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని విజ్ఞప్తి చేశారు. ఐదు మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## తెలంగాణ పథకాలు దేశానికి ఆదర్శం

- ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు
- చర్లకు చెందిన 20 కుటుంబాలు బీఆర్ఎస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్ రేగా

సారపాక, జూలై 22 : తెలంగాణ ప్రభుత్వ పథకాలు దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రభుత్వ విప్ రేగా కాంతారావు పేర్కొన్నారు. ముఖ్యంగా సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు అన్ని వర్గాల ప్రజల్లోనూ విశేష ఆదరణ లభిస్తోందని అన్నారు. అందుకే అందరూ వచ్చి బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు చెప్పారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలకు ఆకర్షితులైన చర్ల మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 20 కుటుంబాల వారు శనివారం మణుగూరు వచ్చి ఇక్కడి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారందరికీ రేగా కాంతారావు గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకూ సంక్షేమ పథకాలు అందుతున్నాయని అన్నారు. ఇక్కడి పథకాలను స్ఫూర్తిగా తీసుకున్న ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు అక్కడ కూడా ఇలాంటి పథకాలను అమలు చేస్తున్నాయని గుర్తుచేశారు. అయితే కాంగ్రెస్ నాయకులు మాత్రం రైతులను మళ్లీ మోసగించేలా పూటకో మాట మాట్లాడుతూ వారిని గందరగోళ పరుస్తున్నారని అన్నారు. గతంలో కాంగ్రెస్ పాలనలో అరిగోస పడ్డ రైతులు మళ్లీ వారి మాయమాటలను గమనించాలని కోరారు. ఈ కార్యక్రమంలో చర్ల ఏఎంసీ మాజీ చైర్మన్ బోదెబోయిన బుచ్చయ్య, బీఆర్ఎస్ నాయకులు సోయం రాజారావు, కోటేరు శ్రీనివాసరెడ్డి, తుర్రం రవికుమార్, సీతాపతిరాజు, జోగిరాజు తదితరులు పాల్గొన్నారు.

స్థలాల క్రమబద్ధీకరణ ప్రక్రియను

## వేగవంతం చేయాలి

**ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్**




మామిళ్లగూడెం, జూలై 22: ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఏర్పరచుకున్న వారికి జీవో 58, 59 ప్రకారం వాటిని క్రమబద్ధీకరించే ప్రక్రియను వేగవంతం చేయాలని ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. 58, 59 జీవోల దరఖాస్తుల పరిష్కారం, పురోగతిపై ఖమ్మం ఐడీవోసీలో సంబంధిత అధికారులతో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రభుత్వం కటాఫ్ తేదీని 2020 జూన్ 2కు పొడిగించినందున రెండో విడత దరఖాస్తుల స్వీకరణ జరిపినట్లు తెలిపారు. జీవో 59 కింద రెండో విడత దరఖాస్తులకు డిమాండ్ల జారీ ప్రక్రియ వెంటనే చేపట్టాలని సూచించారు. డిమాండ్ నోటీసుల జారీ సమయంలో దరఖాస్తుదారులు ఎంత చెల్లించాల్సి ఉంది? ఎప్పటిలోగా చెల్లించాలి? అనే విషయంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. మిగులు జీవో 58 పరిష్కారాలను ఈ నెల ఆఖరులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదనపు కలెక్టర్లు అభిలాష అభినవ్, ఎన్.మధుసూదన్, కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616